క్లుప్తంగా

వైభవంగా దేశమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో దేశమ్మ అమ్మవారు

వాకాడు: మండల కేంద్రమైన వాకాడు స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన గ్రామ దేవత శ్రీదేశమ్మ అమ్మవారికి గత మూడు రోజులుగా గ్రామస్తుల ఆధ్వర్యంలో తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆదివారం రాత్రి అమ్మవారికి దేదీప్యమానంగా విద్యుత్ దీపాలంకరణ, గ్రామ పొంగళ్లు, పుష్పాలంకణతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే కీళ్ల గుర్రాలు, అమ్మవారి జీవిత చరిత్ర నాటికలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

పెంచలకోనలో వర్షం



రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో సోమవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొంత కాలంగా ఎండవేడిమికి, ఉక్కపోతకు అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో కొంత ఉపశమనం పొందారు. మండలంలో పలు గ్రామాల్లో వర్షం కురిసింది ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు రావడంతో చల్ల గాలులు వీయడంతో పాటు చిరుజల్లులు పడడంతో వేసవి తాపం నుంచి ప్రజలు ఊరట పొందుతున్నారు. బ్రహ్మోత్సవాలకు ముందు, బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం పెంచలకోన క్షేత్రంలో వర్షం కురవడం ఆనవాయితీ అని భక్తుల నమ్మకం.

మలేరియా నివారణపై ర్యాలీ



వేపినాపి గ్రామంలో మలేరియా ర్యాలీ

రాపూరు: వేపినాపి గ్రామంలో మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆరోగ్యకేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రమీలరాణి, సూర్యధర్మేంద్ర మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ చేరితే దోమలు వృద్ధి చెందుతాయని, దీంతో దోమల వలన అనేక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నీటినిల్వలు లేకుండా, దోమతెరలు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంబరాలకు దూరంగా ఉండండి



ఎస్‌ఐ సుధీర్‌బాబు

చిల్లకూరు: ఎన్నికల ఫలితాలు వెలువడే బుధవారం రోజున ప్రతి ఒక్కరు సంబరాలకు దూరంగా ఉండాలని చిల్లకూరు ఎస్‌ఐ సుధీర్‌బాబు సూచించారు. చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ తిరుపతిలో జరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా పార్టీల నాయకులు తమ అభిమానం చాటుకునే క్రమంలో సంబరాలు చేపట్టకూడదని తెలిపారు. బాణసంచా కాల్చడం, నృత్యాలు చేయడం, సభలు, ర్యాలీలు చేయవద్దని సూచించారు.

అందరి మద్దతుతో విజయం మాదే...

- వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య



విజయగణపతి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట టౌన్: ప్రజల మద్దతు, దేవుడి దయతో వైఎస్‌ఆర్ సీపీ విజయం సాధిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో ఉన్న విజయగణపతి ఆలయంలో పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ ఫలాలు అందుకున్న లబ్ధిదారులు, అన్నీ వర్గాల ప్రజలు వైఎస్‌ఆర్ సీపీని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారని, తద్వారా ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. సూళ్లూరుపేట అసెంబ్లీ స్థానంలో మూడోసారి హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, ఏఎంసీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, నాయకులు బైనా మల్లికార్జున్‌రెడ్డి, చంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రాహుల్, చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ధనమ్మ

రాపూరు: గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ధనమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో ఎండల్లో తిరగకుండా శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..



కల్లూరు-ఆనేపూడి సరిహద్దు ప్రాంతంలో ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

దొరవారిసత్రం: కల్లూరు–ఆనేపూడి సరిహద్దు ప్రాంతంలో ఆక్రమణకు గురైన రిజర్వు ఫారెస్టు భూమిని సోమవారం అటవీ సెక్షన్ ఆఫీసర్ శివరామప్రసాద్, బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు పరిశీలించి విచారణ చేపట్టారు. సాక్షి దినపత్రికలో ‘ఆక్రమణలో అటవీ శాఖ భూమి’ అనే వార్త ప్రచురితం కావడంతో ఫారెస్టు రేంజర్ ఆఫీసర్ సునీల్‌కుమార్ స్పందించి విచారణ నిమిత్తం అటవీ సిబ్బందిని విచారణ నిమిత్తం ఆక్రమిత ప్రాంతానికి పంపారు. ఆక్రమిత భూములను పరిశీలించిన ఫారెస్టు సిబ్బంది కచ్చితంగా అటవీ భూమి అని చెప్పాలంటే రెవెన్యూ, ఫారెస్టు శాఖలు ఉమ్మడిగా సర్వే చేపట్టాలని తెలియజేశారు. అదే విధంగా ఆనేపూడి రెవెన్యూలోని సర్వే నంబరు 10, 11, 12లోని పశువుల మేత పొరంబోకు భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టుతున్నట్లు సంబంధిత వీఆర్‌ఓ యుగంధర్ తెలియజేశారు.

ముక్కంటి సేవలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం టీటీడీ ఈవో ధర్మారెడ్డి దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద వేదపండితులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్న టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి

ప్రైవేటు పాఠశాలల ఆకస్మిక తనిఖీ



ప్రైవేటు పాఠశాలకు తాళాలు వేస్తున్న ఎంఈవో భువనేశ్వరి తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఎంఈవో భువనేశ్వరి ఆకస్మిక తనిఖీలు చేశారు. అందులో భాగంగా పట్టణంలోని కందన్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. ఆ పాఠశాలకు గుర్తింపు లేకపోవడంతో పాఠశాలను వెంటనే మూసివేయాలని ఆదేశించారు. అనుమతులు వచ్చిన తరువాత పాఠశాలను పునఃప్రారంభించాలన్నారు. అదే విధంగా పట్టణంలోని వివేకానంద పాఠశాలను కూడా తనిఖీ చేశారు. గతంలో వారిపై వచ్చిన ఫిర్యాదులపై పాఠశాల యజమాన్యాన్ని వివరణ కోరారు. మరోసారి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను 12వ తేదీ తరువాతనే పునఃప్రారంభించాలని ఆదేశించారు. ముందుగా ప్రారంభిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు తీసుకునే ఫీజు వివరాలను నోటీసుబోర్డుపై ఉండాలని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేసినా, నోటీసు బోర్డులో పొందు పరచకపోయినా వీటిపై ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కార్యాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.602 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.602 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గూడూరులో ట్రాఫిక్ ఇక్కట్లు



టవర్ క్లాక్ వద్ద ట్రాఫిక్ ఇక్కట్లు

గూడూరు రూరల్: గూడూరులో సోమవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి పోవడంతో ప్రజలు తమ అవసరాలు తీర్చుకునేందుకు బయటకు రావడంతో పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు మొదలయ్యాయి. దీనికి తోడు పట్టణంలో పోలీసులు కూడా ఎన్నికల లెక్కింపునకు సంబధించిన విధుల్లో ఉండడంతో ట్రాఫిక్‌ను నియంత్రించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో టవర క్లాక్ నుంచి సంగం థియేటర్ వరకు వెళ్లేందుకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఆలత్తూరులో జ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఆలత్తూరు గ్రామంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర జ్వరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా జ్వరాలు ఎనాఫిలస్ అనే దోమ నుంచి వ్యాపిస్తాయని తెలిపారు. రోజు విడిచి రోజు జ్వరం రావడం, వణుకుతో కూడిన జ్వరం, తలనొప్పి, వంటి నొప్పులు, రక్తహీనత వంటివి వస్తాయన్నారు. ఈ జ్వరాలు సోకుండా ఉండటానికి దోమలు రాకుండా తెరలు, ఇంటి ద్వారాలకు కిటికీలకు, మెష్‌లు అమర్చుకోవాలని, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఈ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్న పాండూరు పీహెచ్‌సీకి హీరో పరిశ్రమ చేయూత



శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న హీరో పరిశ్రమ ప్రతినిధులు, వైద్యులు

వరదయ్యపాళెం: చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి శ్రీసిటీలోని హీరో మోటార్స్ పరిశ్రమ తోడ్పాటునిచ్చింది. ఆ దిశగా హీరో పరిశ్రమ కమ్యూనిటీ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ(సీఎస్‌ఆర్) నిధులు రూ.14 లక్షలతో 190 మీటర్లు మేరకు నాడు-నేడు ద్వారా నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనానికి ప్రహరీగేటును నిర్మించారు. సోమవారం ఆస్పత్రి వైద్య సిబ్బంది అనిత, లావణ్య, గణాంకాధికారి, సోమశేఖర్ సమక్షంలో హీరో పరిశ్రమ నిధులు ప్లాంట్ మ్యానిఫ్యాక్చరింగ్ హెడ్ నిహాల్ కౌల్, ప్లాంట్ ఆర్ హెడ్ మనోహర చక్రవర్తి, ప్లాంట్ పీఈ హెడ్ అనుప్ గుప్త, చీఫ్ సెక్యూరిటీ కిరణ్, సివిల్ సెక్టార్ హెడ్ ఆశిష్ కుమార్, ప్లాంట్ పీఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ చేతుల మీదుగా నూతన ప్రహరీ గోడను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బంది హీరో పరిశ్రమ ప్రతినిధులకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఇలాగే ఎప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హీరో పరిశ్రమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే రాత్రి వేళలో ఆస్పత్రిలో సిబ్బంది భద్రత కోసం పరిశ్రమకు చెందిన సెక్యూరిటీ గార్డును ఆస్పత్రిలో నియమించి, తమకు భద్రత కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పరిశ్రమ ప్రతినిధులు, ఈ విసయం తమ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ప్రహరీగోడను ప్రారంభిస్తున్న హీరో పరిశ్రమ ప్రతినిధులు

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందిస్తున్న సంస్థ ప్రతినిదులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణ పరిధిలో పదో తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాదించిన విద్యార్థులను ప్రోత్సహించే క్రమంలో స్ఫూర్తి సేవా సంస్థ ఆద్వర్యంలో పురస్కారాలు అందించారు. పట్టణంలోని స్ఫూర్తి సేవా సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బాలక్రిష్ణంరాజు మాట్లాడుతూ సంస్థ ఆద్వర్యంలో పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాదించిన వారికి ఉన్నత చదువులకు దోహదపడేలా వారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో దామోదరరాజు, సుబ్బరాజు, వేమనవర్మ, కిరణ్‌కుమార్, స్వరూపారాణి, రాజశేఖర్, పురంధరరాజు, సురేంద్ర, వివేక్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

పెళ్లకూరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై మండలంలో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. నేడు తేలనున్న ఎన్నికల ఫలితాల కోసం వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతోపాటు సామాన్య ప్రజానీకం కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. మండలంలో మొత్తం 36 పోలింగ్ కేంద్రాల పరిధిలో 27,070 ఓటర్లకు గాను 21,197ఓట్లు పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో 8,676 ఓట్లు వైఎస్‌ఆర్ సీపీకి ఆధిక్యం లభించింది. నేటి ఫలితాల్లో ఇంకా మంచి ఫలితాలు వస్తాయని పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి.

బంగారమ్మ జాతర ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం నుంచి జాతర ప్రారంభమైనట్లు ఈవో ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 7వ తేదీ అంబళ్లు, 11న అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు, అలంకారాలు జరుగుతాయన్నారు. 7గంటలకు గెరిక పూజ, 10గంటలకు మైలు ముగ్గు, మధ్యాహ్నం 2గంటలకు పోతురాజు ముగ్గు, సాయంత్రం 4గంటలకు పొంగళ్లు జరుగుతాయని తెలిపారు.